ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :171గురువారం ఏప్రిల్ 16 2026, పేజీలు - 4 వేల : 2/-

epaper.manaprajaprathinidhi.com

PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

## 'వర్ణ మైత్రి' చిత్రకళ ప్రదర్శన ప్రారంభం



- గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా హాజరు
- సాలార్ జంగ్ మ్యూజియంలో కళోత్సవ వాతావరణం
- రుమాలే చెన్నవసవయ్య చిత్రాలకు విశేష స్పందన

2

## పీర్జాదిగూడలో బీఆర్ఎస్‌లోకి కౌన్సిలర్ల చేరిక



- కేటీఆర్ సమక్షంలో రాజకీయ పరిణామం
- డీలిమిటేషన్‌పై కేంద్రంపై విమర్శలు
- కాంగ్రెస్ హామీలపై కేటీఆర్ ఆగ్రహం

2

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం... హెల్మెట్ తప్పనిసరి



-యువత ప్రాణాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది

-ఆదిలాబాద్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ప్రారంభం

-విపత్తుల కంటే ప్రమాదాల్లోనే ఎక్కువ మరణాలు

2

# బీహార్‌లో బీజేపీకి చారిత్రక విజయం

- సామ్రాట్ చౌదరి ముఖ్యమంత్రిగా ప్రమాణం
- నితీశ్ రాజీనామాతో రాజకీయ మలుపు
- అనుభవజ్ఞులతో కొత్త ప్రభుత్వం ప్రారంభం







పాట్నా, ఏప్రిల్ 15 (మనప్రజాప్రతినిధి): బీహార్ రాజకీయాల్లో చారిత్రక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా భారతీయ జనతా పార్టీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. బీజేపీ సీనియర్ నేత సామ్రాట్ చౌదరి రాష్ట్ర 24వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నాలోని లోక్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ఆయనతో పదవీ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో జేడీయూ నేతలు విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు.మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. దీంతో రాష్ట్రంలో బీజేపీ ప్రత్యక్ష నాయకత్వానికి మార్గం సుగమమైంది. ప్రమాణ స్వీకారానికి ముందు సామ్రాట్ చౌదరి రాజ్‌వంశీ నగర్‌లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**- తలపాగా శపథం నెరవేర్చుకున్న సామ్రాట్**

1990లో రాజకీయాల్లోకి ప్రవేశించిన సామ్రాట్ చౌదరి, 1999లోనే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 2018 నుంచి బీజేపీలో కీలక నేతగా ఎదుగుతూ వచ్చారు. నితీశ్ కుమార్ బీజేపీతో విడిపోయి మహాఘటబంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సమయంలో, శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఉన్న సామ్రాట్ చౌదరి ఒక శపథం చేశారు. నితీశ్‌ను సీఎం పదవి నుంచి దించేంత వరకు తన తలపాగా (మురైఠా) తీయనని ప్రతిజ్ఞ చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి ఆ శపథాన్ని నెరవేర్చుకున్నారు.

**- అనుభవజ్ఞులైన డిప్యూటీ సీఎంలు**

నూతన ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టిన విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ ఇద్దరూ పరిపాలనలో అనుభవజ్ఞులు. ముఖ్యంగా విజేంద్ర ప్రసాద్ యాదవ్‌కు 'కోసీ ప్రాంత రాజకీయ చాణక్యుడు' అనే పేరుంది. 1990 నుంచి వరుసగా ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్న ఆయన, విద్యుత్ రంగంలో అభివృద్ధితో ప్రజల్లో మంచి పేరు సంపాదించారు. సామ్రాట్ చౌదరి నాయకత్వంలో ఈ అనుభవజ్ఞులైన నేతలతో కూడిన కొత్త ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిని ఎలా ముందుకు తీసుకెళ్తుందో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## కూటమి ప్రభుత్వంపై జగన్ ఘాటు విమర్శలు



- మత్స్యకారుల సమస్యలపై ఆగ్రహం
- జువ్వలదిన్నె హార్బర్‌పై ప్రశ్నల వెల్లువ
- మళ్లీ అధికారంలోకి వస్తామన్న ధీమా

2

## సముద్ర మార్గంలో... అక్రమ రవాణాపై ఉక్కుపాదం

-బంగ్లాదేశ్ నుండి వస్తున్న రెండు బోట్ల స్వాధీనం

-రూ. 1.65 కోట్ల విలువైన పోక చెక్కల సీజ్

-తీర ప్రాంత భద్రతపై నిరంతర నిఘా

2

## మహిళా శక్తికి పట్టం...



- కేఎంఐటీ వద్ద భారీ బైక్ ర్యాలీ
- నారీ శక్తి వందన్ అధినియంకు మద్దతుగా మహిళల గర్జన
- చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లతో నవ భారత నిర్మాణం
- మహిళా నేతృత్వంలోని అభివృద్ధికి ప్రధాని మోదీ శ్రీకారం

2

## తిరుపతిలో క్రీడా విప్లవం...

-ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ప్రారంభించిన లోకేష్

-రూ.10.10 కోట్లతో అంతర్జాతీయ స్థాయి వసతుల కల్పన

-తిరుపతి, గూడూరు, సూళ్లూరుపేటలో క్రీడా

3

# 'వర్ణ మైత్రి' చిత్రకళ ప్రదర్శన ప్రారంభం

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనప్రజాప్రతినిధి): తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ముఖ్య అతిథిగా 'వర్ణ మైత్రి: రుమాలే చెన్నవసవయ్య చిత్రాల ప్రతిప్రదర్శన'ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రదర్శనను హైదరాబాద్‌లోని సాలార్ జంగ్ మ్యూజియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సాలార్ జంగ్ మ్యూజియం మరియు రుమాలే ఆర్ట్ హౌస్ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. కళాభిమానులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ప్రదర్శనను సందర్శించారు. చిత్రకళపై ఆసక్తి ఉన్న వారికి ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రుమాలే చెన్నవసవయ్య చిత్రాల్లో భారతీయ సాంస్కృతిక విలువలు, సంప్రదాయ కళా వైభవం ప్రతిబింబిస్తున్నాయని గవర్నర్ అభిప్రాయపడ్డారు. ఆయన కృతులు కళా ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు పొందినవని కొనియాడారు. ఈ ప్రదర్శనలో వివిధ దశల్లో రూపొందించిన చిత్రాలను ప్రదర్శించారు. ప్రతి చిత్రంలో రంగుల సమన్వయం, భావ వ్యక్తీకరణ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. కళాకారుని సృజనాత్మకతకు ఇది నిదర్శనమని సందర్శకులు అభిప్రాయపడ్డారు. కళా ప్రదర్శనలు సమాజంలో సృజనాత్మకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు. యువ కళాకారులకు ఇవి ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన కొద్ది రోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కళాభిమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రదర్శనను సందర్శించాలని సూచించారు.

# పీర్జాదిగూడలో బీఆర్ఎస్‌లోకి కౌన్సిలర్ల చేరిక

మెదటి పేజీ తరువాయి



మేడ్చల్, ఏప్రిల్ 15 (మనప్రజాప్రతినిధి): మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని వారికి స్వాగతం పలికారు. స్థానిక నాయకులకు అభినందనలు తెలియజేస్తూ పార్టీ బలోపేతంపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ లోక్‌సభ, శాసనసభ సీట్ల పెంపుపై కేంద్ర ప్రభుత్వం చెప్పేది ఒకటి, చేసేది మరోకటని విమర్శించారు. డీలిమిటేషన్ పేరుతో బీజేపీ మరో కొత్త కుట్రకు తెరలేపుతోందని ఆరోపించారు. దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడటంలో బీఆర్ఎస్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కే ప్రయత్నం జరిగితే సహించబోమని కేటీఆర్ హెచ్చరించారు. అవసరమైతే కేసీఆర్ నాయకత్వంలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్రం తీసుకునే నిర్ణయాలపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. మహిళా సంక్షేమంపై కూడా కేటీఆర్ వ్యాఖ్యానిస్తూ, తమ ప్రభుత్వం మార్కెట్ కమిటీలలో 50 శాతం రిజర్వేషన్లు కల్పించిందని తెలిపారు. శాసనసభలో మహిళా రిజర్వేషన్‌పై తీర్మానం కూడా ఆమోదించామని గుర్తుచేశారు. మహిళల సాధికారతకు బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. రెండున్నర సంవత్సరాలు గడిచినా వాగ్దానాలు నెరవేర్చలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన ఆర్థిక సాయం, స్కూటీల వాగ్దానాలపై ప్రశ్నలు లేవనెత్తారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేస్తూ, కేసీఆర్ నాయకత్వంలో అనేక కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యాయని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వంలో అవి నిలిచిపోయాయని విమర్శించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా బీఆర్ఎస్ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు.

# కూటమి ప్రభుత్వంపై జగన్ ఘాటు విమర్శలు

మెదటి పేజీ తరువాయి



నెల్లూరు, ఏప్రిల్ 15 (మనప్రజాప్రతినిధి): మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన అన్యాయంగా కొనసాగుతోందని ఆరోపించారు. దేవుడు అన్నీ చూస్తున్నాడని, త్వరలోనే పరిస్థితులు మారతాయని వ్యాఖ్యానించారు. కళ్లు మూసుకుని తెరిచేలోపు మళ్లీ తమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా జగన్ జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చామని గుర్తుచేశారు. రూ.26 వేల కోట్లతో నాలుగు కొత్త పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు 35 శాతం పూర్తయ్యాయని, రామాయపట్నం పోర్టు పనులు దాదాపు పూర్తయ్యాయని వివరించారు. 2024 మార్చి 12న జువ్వలదిన్నె హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభించామని జగన్ గుర్తుచేశారు. అయితే ఇప్పటికీ మత్స్యకారులకు హార్బర్‌ను ఎందుకు అప్పగించలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం మత్స్యకారులకు మేలు చేయకపోగా వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తోందని విమర్శించారు. జువ్వలదిన్నె ప్రాంతం నుంచి మత్స్యకారులను తరిమివేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఇదే సమయంలో నారా లోకేశ్ పర్యటన తర్వాత సీజ్ చేసిన బోట్లు ఎత్తుకెళ్లిన ఘటనపై జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. అధికారంలో ఉన్న పెద్దలే ఈ ఘటనకు కారణమని, అందుకే ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని పేర్కొన్నారు. బోట్లు ఎత్తుకెళ్లిన వారికీ ప్రభుత్వ పెద్దల ఆశీస్సులు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. మరో మూడు సంవత్సరాల్లో పరిస్థితులు మారుతాయని, తిరిగి తమ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మహిళా శక్తికి పట్టం...

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, ఏప్రిల్ 15 (మనప్రజాప్రతినిధి): దేశాభివృద్ధిలో మహిళల పాత్రను మరింత క్రియాశీలం చేసే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చారిత్రాత్మక 'నారీ శక్తి వందన్ అధినియం'కు మద్దతుగా హైదరాబాద్ నగరంలో మహిళలు పెద్ద ఎత్తున కదిలారు. నగరంలోని కేఎంఐటీ కళాశాల వద్ద బుధవారం ఉదయం నిర్వహించిన ఉత్సాహభరితమైన మహిళల బైక్ ర్యాలీని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళలు ద్విచక్ర వాహనాలపై తరలివచ్చి మహిళా సాధికారతకు నినాదాలు చేస్తూ తమ సంఘీభావాన్ని ప్రకటించారు. లోక్‌సభ మరియు రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం ద్వారా భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైందని రాంచందర్ రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ చట్టం వల్ల మన దేశ ఆడబిడ్డలు ఇకపై కేవలం ఓటర్లుగానే కాకుండా, నవ భారత విధాన నిర్ణేతలుగా చారిత్రక పాత్ర పోషించనున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఈ రిజర్వేషన్ బిల్లును అమలులోకి తీసుకురావడం ద్వారా మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని కేంద్రం సుస్థిరం చేసిందని ఆయన కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలనలో "మహిళా నేతృత్వంలోని అభివృద్ధి" అనేది కేవలం ఒక నినాదం కాదని, అది క్షేత్రస్థాయిలో కనిపిస్తున్న వాస్తవమని ఆయన స్పష్టం చేశారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో మహిళలు కీలక భాగస్వాములవుతున్నారని, వారి ఆర్థిక మరియు సామాజిక ఎదుగుదలే దేశాభివృద్ధికి కొలమానమని తెలిపారు. రిజర్వేషన్ల ద్వారా లభించే అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకుని, పరిపాలనలో తమదైన ముద్ర వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో పాల్గొన్న మహిళలు దేశ ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. చట్టసభల్లో రిజర్వేషన్లు మహిళల ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని, స్థానిక సంస్థల నుండి పార్లమెంట్ వరకు మహిళల గళం బలంగా వినిపిస్తుందని పాల్గొన్న ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విద్యావంతులైన యువతులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని, ఈ చట్టం వారికి ఒక గొప్ప వేదికగా నిలుస్తుందని ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. నారాయణగూడ నుండి ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ నగరంలోని ప్రధాన వీధుల గుండా సాగి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ మహిళా మోర్చా నాయకులు, కేఎంఐటీ కళాశాల ప్రతినిధులు మరియు పెద్ద ఎత్తున మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. రిజర్వేషన్ల అమలుతో భవిష్యత్తులో శాసనసభలు మరియు పార్లమెంట్‌లో మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, తద్వారా స్త్రీ సంక్షేమ పథకాల రూపకల్పనలో మరింత పారదర్శకత వస్తుందని నేతలు ఈ సందర్భంగా విశ్లేషించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం హెల్మెట్ తప్పనిసరి

మెదటి పేజీ తరువాయి









ఆదిలాబాద్, ఏప్రిల్ 15 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో భారీగా ప్రాణనష్టం సంభవిస్తుండటంపై ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా కుటుంబాలకు వెన్నెముకగా ఉండాల్సిన యువకులు ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఉద్ఘాటించారు. సాధారణంగా ఏదైనా ప్రకృతి విపత్తు సంభవించినప్పుడు ఎంతమంది ప్రాణాలు కోల్పోతారో, అంతకంటే ఎక్కువ మంది రోడ్డు ప్రమాదాల వల్ల మరణిస్తున్నారని మంత్రి గణాంకాలతో వివరించారు. ఈ మరణాల వల్ల ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని, పిల్లలు అనాథలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు కలిగే ప్రాణనష్టం కేవలం ఒక వ్యక్తికే పరిమితం కాదని, అది మొత్తం కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన గుర్తు చేశారు. అందుకే ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఆయన కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రవాణా శాఖ మరియు పోలీస్ శాఖ సంయుక్తంగా 'అరైవ్ అలైవ్' వంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని మంత్రి తెలిపారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, వేగ పరిమితిని మించకూడదని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన పిలుపునిచ్చారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయం నుండి 80 శాతం వరకు తప్పించుకునే అవకాశం ఉంటుందని, దీనిని ఒక భారంగా భావించకుండా బాధ్యతగా గుర్తించాలని ఆయన స్పష్టం చేశారు. యువత బైక్ రేసింగ్‌లు మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలు ఇచ్చేముందు వారికి భద్రత పట్ల అవగాహన కల్పించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అనేది జరిమానాల నుంచి తప్పించుకోవడానికి మాత్రమే కాదని, మన ప్రాణాలను మనం కాపాడుకోవడానికేనని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా, ప్రజల భాగస్వామ్యం మరియు స్వీయ నియంత్రణ లేనిదే ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించడం సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు మరియు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. రోడ్డు భద్రతపై ప్రభుత్వం చేపడుతున్న ఈ ప్రచారం నిరంతరం కొనసాగుతుందని, జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని అధికారులు వెల్లడించారు. 'అరైవ్ అలైవ్' లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడు ట్రాఫిక్ నియమాలను గౌరవించాలని మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

# సముద్ర మార్గంలో అక్రమ రవాణాపై ఉక్కుపాదం

మెదటి పేజీ తరువాయి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 (మనప్రజాప్రతినిధి): భారత సముద్ర సరిహద్దుల ద్వారా జరుగుతున్న అక్రమ రవాణాను అడ్డుకోవడంలో భారత కోస్ట్ గార్డ్ మరో భారీ విజయాన్ని సాధించింది. బంగ్లాదేశ్ నుండి అక్రమంగా పోక చెక్కలను తరలిస్తున్న రెండు భారతీయ చేపల వేట బోట్లను కోస్ట్ గార్డ్ నౌక 'అమోగ్' మంగళవారం విజయవంతంగా అడ్డుకుంది. దేశ ఆర్థిక ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఇటువంటి అక్రమ కార్యకలాపాలను సహించేది లేదని ఈ ఆపరేషన్ ద్వారా అధికారులు స్పష్టమైన సంకేతాలు పంపారు. ఈ ఆపరేషన్‌లో సుమారు 35,000 కిలోల నిషేధిత పోక చెక్కలను కోస్ట్ గార్డ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మార్కెట్ విలువ దాదాపు రూ. 1.65 కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. పక్కా సమాచారంతో, పకడ్బందీ ప్రణాళికతో చేపట్టిన ఈ గాలింపు చర్యల్లో అక్రమ రవాణా దారులు పట్టుబడ్డారు. సముద్ర మార్గంలో నిరంతరం నిఘా ఉంచడం మరియు ఆపరేషనల్ రెడీనెస్‌తో ఉండటం వల్లే ఈ పట్టుబాటు సాధ్యమైందని కోస్ట్ గార్డ్ వర్గాలు వెల్లడించాయి. సముద్ర సరిహద్దుల్లో అనుమానిత బోట్ల కదలికలపై కోస్ట్ గార్డ్ నౌక అమోగ్ నిశితంగా నిఘా పెట్టింది. బంగ్లాదేశ్ సరిహద్దుల నుండి వస్తున్న ఈ బోట్లను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, భారీ ఎత్తున పోక చెక్కల బస్తాలు బయటపడ్డాయి. వీటికి సంబంధించి ఎటువంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో బోట్లను సీజ్ చేసి, అందులోని సిబ్బందిని విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న సూత్రధారుల కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు. భారతదేశ సముద్ర సరిహద్దులను మరియు ఆర్థిక ప్రయోజనాలను కాపాడటంలో కోస్ట్ గార్డ్ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని అధికారులు తెలిపారు. తీర ప్రాంత భద్రతకు సంబంధించి వివిధ భాగస్వామ్య పక్షాలతో సమన్వయం చేసుకుంటూ, చొరబాట్లు మరియు స్మగ్లింగ్‌ను అరికట్టడానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. 'వయం రక్షామః' (మేము రక్షిస్తాము) అనే నినాదంతో నిరంతరం సముద్ర జలాల్లో పహారా కాస్తున్నట్లు వెల్లడించారు. ఇటీవలి కాలంలో సముద్ర మార్గాల్లో స్మగ్లింగ్ ముఠాల ఆగడాలు పెరుగుతున్న నేపథ్యంలో కోస్ట్ గార్డ్ తన నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. డ్రోన్లు మరియు అధునాతన రాడార్ల సహాయంతో అనుమానిత నౌకలను గుర్తిస్తున్నారు. దేశ రక్షణలో మరియు ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే అక్రమ రవాణాను అడ్డుకోవడంలో తాము వెనకడుగు వేయబోమని ఈ సందర్భంగా ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. సీజ్ చేసిన సరుకును తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత శాఖలకు అప్పగించారు.

# తిరుపతిలో క్రీడా విప్లవం...

తరువాయి భాగం



తిరుపతి, ఏప్రిల్ 15 (మనప్రజాప్రతినిధి): ఆధ్యాత్మిక నగరం తిరుపతిని క్రీడల హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం భారీ ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకువచ్చింది. తిరుపతి పట్టణం గొల్లవాని గుంటలో సుమారు రూ.10.10 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక 'ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్' మరియు వివిధ క్రీడా అకాడమీలను రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఈ కాంప్లెక్స్ ఎంతగానో దోహదపడుతుందని ఆయన ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా లోకేష్ పలు కీలక క్రీడా విభాగాలను ప్రారంభించారు. ముఖ్యంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ మరియు ఆర్చరీ అకాడమీలను ఆయన ప్రారంభించి, క్రీడాకారులతో ముచ్చటించారు. వీటితో పాటు యువత ఎంతగానో ఎదురుచూస్తున్న ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియం మరియు క్రికెట్ పెవిలియన్‌ను కూడా ఆయన జాతికి అంకితం చేశారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల శిక్షణ సౌకర్యాలు ఒకే చోట లభించేలా ఈ కేంద్రాన్ని రూపొందించడం విశేషం. తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రూ.5.35 కోట్ల వ్యయంతో నిర్మించిన కరణం మల్లీశ్వరి వెయిట్ లిఫ్టింగ్ అకాడమీని మంత్రి ప్రారంభించారు. ఒలింపిక్ విజేత కరణం మల్లీశ్వరి పేరు మీద ఈ అకాడమీని ఏర్పాటు చేయడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా భవిష్యత్తులో మన రాష్ట్రం నుండి మరిన్ని ఒలింపిక్ పతకాలు సాధించే వెయిట్ లిఫ్టర్లు తయారవుతారని ఆకాంక్షించారు. ఈ అకాడమీలో అంతర్జాతీయ స్థాయి పరికరాలు మరియు శిక్షకులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా క్రీడల అభివృద్ధికి లోకేష్ పునాది వేశారు. గూడూరు నియోజకవర్గం కోటలో రూ.2.31 కోట్లతో, సూళ్లూరుపేటలో రూ.2.70 కోట్లతో నిర్మించనున్న ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రాలకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే రేణిగుంట ఏపీఎస్టీఆర్ఈఐఎస్ స్కూల్ ఆవరణలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించే క్రీడా వికాస కేంద్రం నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ నియోజకవర్గాల్లో క్రీడా మౌలిక సదుపాయాల కల్పన ద్వారా గ్రామీణ యువతకు కొత్త అవకాశాలు లభిస్తాయని ఆయన వివరించారు. క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా, యువతలో క్రమశిక్షణ మరియు పట్టుదలను పెంచుతాయని మంత్రి లోకేష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ క్రీడా వికాస కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. క్రీడాకారులకు ఉపాధి అవకాశాల్లో వెయిటేజీ ఇవ్వడంతో పాటు, వారికి అవసరమైన ఆర్థిక ప్రోత్సాహకాలను కూడా అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, క్రీడా శాఖ అధికారులు మరియు పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు.

# భద్రతా దళాల పహారా...

**-అగర్తలా విమానాశ్రయంలో భారీ ఉమ్మడి మాక్ డ్రిల్**

**-వివిధ రక్షణ సంస్థల సమన్వయంతో హై-ఇంటెన్సిటీ వ్యాయామం**

**-అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడంలో భద్రతా దళాల సంసిద్ధత**

**-విమాన ప్రయాణీకుల భద్రతపై ఏజెన్సీల ప్రత్యేక దృష్టి**




అగర్తలా, ఏప్రిల్ 15 (మనప్రజాప్రతినిధి): త్రిపుర రాజధాని అగర్తలాలోని మహారాజా బీర్ బిక్రమ్ విమానాశ్రయంలో బుధవారం వివిధ రక్షణ మరియు భద్రతా సంస్థల ఆధ్వర్యంలో భారీ ఉమ్మడి మాక్ డ్రిల్ నిర్వహించారు. విమానాశ్రయ భద్రతను పటిష్టం చేయడంలో భాగంగా నిర్వహించిన ఈ హై-ఇంటెన్సిటీ వ్యాయామంలో సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ , అస్సాం రైఫిల్స్, ఆల్బర్ట్ ఎక్కా బ్రిగేడ్ (ఘాతక్ ప్లాటూన్), త్రిపుర పోలీస్ మరియు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు చురుగ్గా పాల్గొన్నారు. ఏదైనా ఊహించని భద్రతా సవాళ్లు ఎదురైనప్పుడు వివిధ దళాల మధ్య సమన్వయం ఎలా ఉండాలనే అంశంపై ఈ డ్రిల్‌లో ప్రధానంగా దృష్టి సారించారు. ఈ మాక్ డ్రిల్ సందర్భంగా భద్రతా దళాలు అద్భుతమైన సమన్వయాన్ని మరియు వేగవంతమైన స్పందనను ప్రదర్శించాయి.



విమానాశ్రయ ప్రాంగణంలోకి అనుమానిత వ్యక్తులు ప్రవేశించినప్పుడు లేదా హైజాక్ వంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఒక ఏజెన్సీ నుండి మరో ఏజెన్సీకి సమాచార మార్పిడి ఎంత వేగంగా జరుగుతుందనే విషయాన్ని ఉన్నతాధికారులు నిశితంగా గమనించారు. నిరంతర శిక్షణ మరియు టీమ్ వర్క్ ద్వారా మాత్రమే ఇటువంటి క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కోగలమని అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. ఇలాంటి ఉమ్మడి వ్యాయామాలు వివిధ రక్షణ సంస్థల మధ్య అంతర్గత సమన్వయాన్ని బలోపేతం చేయడమే కాకుండా, విమానాశ్రయ భద్రతా వ్యవస్థలోని లోపాలను గుర్తించి సరిదిద్దుకోవడానికి సహాయపడతాయని సీఐఎస్ఎఫ్ ప్రతినిధులు తెలిపారు. విమాన ప్రయాణీకులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే తమ ప్రాథమిక లక్ష్యమని, ఇందుకోసం అత్యాధునిక సాంకేతికతను మరియు వ్యూహాత్మక శిక్షణను ఉపయోగిస్తున్నామని వారు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సున్నితమైన విమానాశ్రయాల్లో ఇటువంటి మాక్ డ్రిల్స్ క్రమం తప్పకుండా నిర్వహించడం భద్రతా ప్రోటోకాల్‌లో భాగమని వారు గుర్తు చేశారు. అగర్తలా విమానాశ్రయంలో జరిగిన ఈ కార్యక్రమంలో త్రిపుర పోలీస్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. స్థానిక పోలీసులకు మరియు కేంద్ర భద్రతా దళాలకు మధ్య ఉన్న పరస్పర అవగాహన ఈ డ్రిల్ ద్వారా మరింత మెరుగుపడిందని వారు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అస్సాం రైఫిల్స్ మరియు ఘాతక్ ప్లాటూన్ వంటి ప్రత్యేక దళాల భాగస్వామ్యం ఈ వ్యాయామానికి మరింత బలాన్ని చేకూర్చింది. అత్యవసర సమయాల్లో నిమిషాల వ్యవధిలోనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చేలా తమ దళాలను 'మిషన్ రెడీ' స్థితిలో ఉంచుతున్నట్లు భద్రతా వర్గాలు స్పష్టం చేశాయి. ఈ వ్యాయామం విజయవంతంగా ముగియడం పట్ల ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. విమానాశ్రయాల వంటి రద్దీగా ఉండే ప్రదేశాల్లో భద్రతా ఏర్పాట్లు ఎప్పుడూ అత్యున్నత స్థాయిలో ఉండాలని, ప్రజలు ఎటువంటి భయాందోళనలు చెందకుండా ప్రయాణించవచ్చని వారు భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఇదే తరహాలో మరిన్ని ఉమ్మడి శిక్షణా తరగతులను నిర్వహించాలని నిర్ణయించారు. దేశ భద్రతే ప్రథమ ప్రాధాన్యతగా పనిచేస్తున్న ఈ దళాల కృషిని స్థానికులు మరియు ప్రయాణీకులు అభినందిస్తున్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

**-మంత్రి శ్రీధర్ బాబు**

**-480 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాల పంపిణీ**

**-కళ్యాణ లక్ష్మీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన మంత్రి**

**-అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ**



మంథని, ఏప్రిల్ 15 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలోని అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ అభివృద్ధి ఫలాలను అందించడమే కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. బుధవారం మంథని నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు ప్రభుత్వ సాయాన్ని అందజేస్తూ, నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడంలో తమ ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా మంథని మున్సిపాలిటీతో పాటు మంథని, ముత్తారం, కమాన్ పూర్, రామగిరి మండలాలకు చెందిన 480 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాలను మంత్రి శ్రీధర్ బాబు అందజేశారు. ఏళ్ల తరబడి సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఈ పథకం ఒక వరమని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గవ్యాప్తంగా దశలవారీగా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. సంక్షేమ పథకాల అమలులో భాగంగా 129 మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 169 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 1.84 కోట్ల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. పేదల కష్టకాలంలో ప్రభుత్వం అండగా ఉంటుందని, వైద్యం కోసం ఎవరూ అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతో సీఎంఆర్ఎఫ్ నిధులను త్వరితగతిన మంజూరు చేస్తున్నామని మంత్రి వివరించారు. విద్య వైద్య రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్న అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని 160 మంది అంగన్‌వాడీ టీచర్లకు మంత్రి శ్రీధర్ బాబు స్మార్ట్ మొబైల్ ఫోన్లను అందజేశారు. ఇకపై అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ, సమాచార సేకరణ మరియు రిపోర్టింగ్ ప్రక్రియ డిజిటల్ విధానంలో సులభతరం అవుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారులకు నాణ్యమైన సేవలు అందించాలని టీచర్లకు సూచించారు. మంథని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు. అర్హత ఉండి పథకాలు అందని వారుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు మరియు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు. మంత్రి పర్యటనతో మంథని నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది.



# రోడ్డు భద్రతా నియమాలు పాటించండి




మనప్రజాప్రతినిధి//చేగుంట ఏప్రిల్ 15,: రోడ్డు వారోత్సవాల్లో భాగంగా పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చేగుంట విద్యార్థులు చేగుంట పాఠశాల నుండి గాంధీ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం నిర్వహించరు . ఈ సందర్భంగా చేగుంట ఎస్సై చైతన్య రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించినప్పుడే, రోడ్డు ప్రమాదాలను నివారించగలుగుతామని, మద్యం తాగి వాహనాలు నడప రాదని, అతివేగం కూడా ప్రమాదాల కారణమవుతాయని, ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలి వారన్నారు. ఈ కార్యక్రమంలో చేగుంట ఎంఈఓ నీరజ, ఎస్సై 2 బిక్య నాయక్, పోలీస్ సిబ్బంది వెంకటేష్,మహేష్,సిద్దు,రవి, ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్, గర్దాస్ మనోహర్ రావు, రావుల వెంకటేష్, ఉమామహేశ్వరి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు

# పోషణ పక్వాడ కార్యక్రమం



మనప్రజాప్రతినిధి//చేర్యాల:జనగామ నియోజకవర్గం. చేర్యాల మున్సిపల్ పట్టణ కేంద్రంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ చేర్యాల,వారి ఆధ్వర్యంలో 8వ పోషణ పక్వాడ సందర్భంగా సిడిపిఓ రమాదేవి,హృదయస్పర్శి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు మరియు స్కూల్ పిల్లలకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల పోషణ, విద్యా సేవలను మరింత బలోపేతం చేయడానికి ఈ మొబైల్స్ ఉపయోగపడతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు అన్నప్రాసన (ప్రథమ ఆహారం) మరియు అక్షరాభ్యాసం కార్యక్రమాలను ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి,చేతుల మీదుగా నిర్వహించారు. చిన్నారులు సంతోషంగా పాల్గొని,ఈ కార్యక్రమాన్ని మరింత స్ఫూర్తిదాయకం చేశారు. పోషణ పక్వాడ (ఏప్రిల్ 9 నుంచి 23 వరకు) లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమం ద్వారా బాల్య పోషణ,ప్రారంభ విద్యా సేవలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యం,విద్యా అభివృద్ధికి ప్రభుత్వం,స్థానిక సంస్థలు, కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ మంచి కార్యక్రమం ద్వారా చేర్యాల పట్టణ కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు మరియు పాఠశాలలు మరింత బలపడతాయని, చిన్నారుల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముస్త్యాల అరుణ బాల నరసయ్య,వైస్ చైర్మన్ ఉమా శ్రీధర్,కమిషనర్ నాగేందర్,కౌన్సిలర్లు, అధికారులు,అంగన్వాడీ సూపర్వైజర్లు,టీచర్లు,ఆయాలు,గర్భిణీ స్త్రీలు,చిన్నారుల తల్లిదండ్రులు,ప్రజా ప్రతినిధులు,పాల్గొన్నారు.

మన ప్రజాప్రతినిధి దినపత్రిక



# వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా



మనప్రజాప్రతినిధి//చేర్యాల:జనగామ నియోజకవర్గం.చేర్యాల,మద్దూర్, కొమురవెల్లి మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో ఐకెపి. పిఎసిఎస్ (ఇంటిగ్రేటెడ్ క్రాప్ ప్లానింగ్ – ప్రైమరీ అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీలు) ఆధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనగామ శాసనసభ్యులు డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై,కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక రైతులు,రైతు నాయకులు,మండల అధికారులు మరియు సహకార సంఘాల ప్రతినిధులు,భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కొనుగోలు కేంద్రాల ప్రారంభం వల్ల స్థానిక రైతులు తమ వడ్లను సమీపంలోనే గిట్టుబాటు ధరకు అమ్ముకోవడం సాధ్యమవుతుంది. మధ్యవర్తుల మధ్యలేకుండా నేరుగా ప్రభుత్వ/సహకార సంఘాల ద్వారా కొనుగోలు జరగడం వల్ల రైతులు మెరుగైన లాభాలు పొందే అవకాశం ఏర్పడింది. ఈ సందర్భంగాఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి,మాట్లాడుతూ, రైతుల సంక్షేమం కోసం అన్ని రకాల వడ్ల కొనుగోలు సకాలంలో జరగాలని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమం సిద్దిపేట జిల్లా రైతులకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని, ప్రభుత్వం మరిన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే ఇలాంటి కొనుగోలు కేంద్రాలు మరింతగా విస్తరించాలి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# చేగుంట మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలి




మనప్రజాప్రతినిధి//చేగుంట ఏప్రిల్ 15: చేగుంట మండల కేంద్రం భౌగోళికంగా, వసతులపరంగా అన్ని రకాలుగా ఉన్నందున చేగుంట మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని చేగుంట మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు దొంతి రెడ్డి ఎల్లారెడ్డి, చేగుంట మండల బిజెపి పార్టీ నాయకులు చేగుంట తాసిల్దార్ శివప్రసాద్ కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేగుంట మండల కేంద్రంలో రైల్వే స్టేషన్, 44 హైవేతోపాటు పరిశ్రమల కేంద్రంగా, విద్యాసంస్థలు నియోజక వర్గానికి కావాల్సిన ప్రభుత్వ భూమి కలదు, చుట్టూ ఉన్న మండలాలకు మధ్యలో ఉన్నందున చేగుంట మండల కేంద్రాన్ని నియోజకవర్గ కేంద్రంగా చేయాలని వారు కోరారు. నియోజకవర్గ ఏర్పాటుకు అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న మండలం కావున చేగుంట మండల ప్రజల అభిప్రాయం మేరకు చేగుంటను నియోజకవర్గ కేంద్రంగా చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు దొంతి రెడ్డి ఎల్లారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు చింతల భూపాల్,బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కరణం గణేష్ రవికుమార్, వార్డు సభ్యులు సాయిబాబా, ఎల్లేష్, రవి పోలంపల్లి వార్డు సభ్యుడు శేఖర్ గౌడ్ మండల బిజెపి పార్టీ ప్రధాన కార్యదర్శి సంతోష్ రెడ్డి పాల్గొన్నార

# దయచేసి రోడ్డు భద్రత నియమాలు పాటించండి




**-చేర్యాల పోలీస్ ల ఆధ్వర్యంలో విద్యార్థులచే ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం**

**-కుటుంబాలను వీధిలో పడేయకండి స్కూల్ విద్యార్థిని విద్యార్థులు**

**-వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించండి సీఐ బానోతు రమేష్**



మనప్రజాప్రతినిధి//చేర్యాల,జనగామ:జనగామ నియోజకవర్గం. చేర్యాల పట్టణ కేంద్రంలోని స్థానిక పోలీస్ ల ఆధ్వర్యంలో సిద్దిపేట సి.పి.రేష్మి పెరుమాళ్,ఆదేశానుసారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రజెంటేషన్ స్కూల్ విద్యార్థులతో కలిసి చేర్యాల పోలీసులు చేపట్టిన రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం పట్టణ ప్రజలను ఆలోచింప చేసే విధంగా కొనసాగినది .చేర్యాల పట్టణంలో ని జాతీయ రహదారిపై ప్రజెంటేషన్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులచే రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం రోడ్డుపై వెళ్లే ప్రజలను ఆకర్షించినది.విద్యార్థులు రోడ్డు భద్రత గురించి తయారుచేసిన ప్లకార్డులు, ఫ్లెక్సీలు మరియు వారి మాటలు,పాటలు ప్రజలను ఆలోచింప ఆలోచింపజేసే విధంగా కొనసాగినది.ఈ సందర్భంగా స్కూలు విద్యార్థులు మాట్లాడుతూ ముఖ్యంగా రోడ్డుపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించి ప్రయాణించవలేనని దయచేసి రోడ్డు భద్రత నియమాలు పాటించాలని.బైక్ ల పై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించి,కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు పెట్టుకొని, ప్రయాణం చేయాలని అలాగే మద్యం తాగి వాహనాలు నడిపేటప్పుడు రోడ్లపై వెళ్తున్న ప్రజలు ప్రమాదాల దానికి గురై ప్రాణాలు కోల్పోతున్నారని దానివలన వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఇకనైనా అందరూ జాగ్రత్తగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలని విద్యార్థులు కోరారు.అనంతరం రోడ్డు భద్రత నియమాలపై స్థానిక సీఐ బానోత్ రమేష్,ఎస్ఐ అపూర్వ రెడ్డి,ఆధ్వర్యంలో విద్యార్థులు,మరియు వాహనదారులతో ప్రతిజ్ఞ చేపించారు.ఈ సందర్భంగా సిఐ రమేష్ మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులు రోడ్డు భద్రత గురించి చేసిన, ప్ల కార్డులు, ఫ్లెక్సీలు వారు మాట్లాడిన మాటలు వారు పాడిన పాటలతో ప్రజల్లో చైతన్యం రావాలని ఇప్పటికైనా దయచేసి బైక్ ల పై వెళ్లేవారు హెల్మెట్ ధరించాలని అలాగే కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్టు ధరించాలని విజ్ఞప్తి చేశారు.మద్యం సేవించి వాహనాలు నడపవద్దని అన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వలన మీరే కాక మీ వల్ల ఇతరులు కూడా ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ఉందని అన్నారు.అలాగే ప్రమాదాలు జరిగితే మీ కుటుంబం మొత్తం వీధిన పడుతుందని అందుకే తగిన జాగ్రత్తలు తీసుకొని ప్రయాణించాలని తెలిపారు.రోడ్లపై అతివేగంతో వెళ్లడం ప్రమాదకరమని తెలిపారు. దయచేసి ప్రజలందరు రోడ్ల భద్రత నియమాలు పాటించి మీ కుటుంబాలకు కాపాడుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో చేర్యాల ఎస్సై.అపూర్వ రెడ్డి, ప్రజెంటేషన్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్. జ్యోతి,ఉపాధ్యాయులు,పోలీస్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు, ప్రజలు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్



మనప్రజాప్రతినిధి//ఏప్రిల్15:చేగుంట మండల పరిధిలోని మక్కారాజ్ పేట్ గ్రామం లో ప్రభుత్వం ప్రత్యేకంగా రైతుల కోసం ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రం ను గ్రామ సర్పంచ్ రేఖ సురేష్ రెడ్డి ప్రారంభించారు, అనంతరం రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు పండించిన పంటను దళారులకు కాకుండా, ప్రభుత్వ ఐకెపి కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని దళారులను అమ్మి మోస పోవద్దన్నారు రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాల్ కు 500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమం గ్రామ ఉపసర్పంచ్ మొగులయ్య,ఏపీఎం దుర్గాప్రసాద్,సీసీ అంజయ్య వార్డ్ సభ్యులు , వి ఓ ఏ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు నామినేటెడ్ పదవుల్లో జనాభా దామాషా ప్రకారం అవకాశం కల్పించాలి




హైదరాబాద్(మనప్రజాప్రతినిధి దినపత్రిక ):జనాభా దామాషా ప్రకారం బీసీలకు త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ముఖ్యమంత్రికి మరియు పిసిసి అధ్యక్షుడికి విజ్ఞప్తి చేశారు మంగళవారం నాడు ఆయన హైదరాబాద్ హిమాయత్ నగర్ లోగల బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయం లో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ మరియు మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బాపురాజుతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ... గత ఎమ్మెల్యే ఎంపీ ఎన్నికల సందర్భంగా బీసీలకు ఎమ్మెల్యే ఎంపీ టికెట్లు అడిగితే గెలుపు గుర్రాలకి టికెట్లు ఇస్తామని చెప్పి బీసీలకు ఎక్కువ టికెట్లు ఇవ్వలేదని అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పి ఇప్పుడు అది కూడా చేయడం లేదని ఏదో తూ తూ మంత్రంగా ప్రాధాన్యత లేని పదవులను బీసీలకు కట్టబెడుతూ కేవలం ఒకే ఒక కులానికి అన్ని పదవులు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీకి సంబంధం లేని వ్యక్తులకు కార్పొరేషన్ పదవులు కట్టబెడుతూ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీని నమ్ముకున్న బీసీలకు మాత్రం మొండి చేయి చూపిస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో బిల్లు ఆమోదిస్తే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అడ్డుకున్నదని అందువల్ల బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఐనప్పటికీ తమ పార్టీ తరఫున 42 శాతం సీట్లు కేటాయిస్తామన్న కాంగ్రెస్ పార్టీ తన మాటను నిలబెట్టుకోకపోయినప్పటికీ ప్రజలు జనరల్ స్థానాల్లో పోటీ చేసిన బీసీలను గెలిపించారని ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ మరియు మున్సిపల్ ఎన్నికల్లో 61% బీసీలను గెలిపించారని ఇది బీసీల చైతన్యానికి నిదర్శనం అని అందువల్ల బీసీల చైతన్యాన్ని గుర్తించి త్వరలో భర్తీ చేసే నామినేటెడ్ పదవుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు అలాగే కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో బీసీలకు ఇచ్చిన 21 హామీలలో ఏ ఒక్కటి నెరవేర్చలేక పోయారని ప్రత్యేక కమిటీ వేసి అఖిలపక్ష బీసీ సంఘాల నాయకులను అందులో బాధ్యులుగా చేర్చుకొని అందరి సూచనల మేరకు బీసీల అభివృద్ధి కొరకు తగు చర్యలు చేపట్టాలని ఇప్పటికే రెండు న్నర సంవత్సరాలు పూర్తయిందని మరో రెండు న్నర సంవత్సరాల మాత్రమే మిగిలి ఉన్నది అని ఈ సమయంలో బీసీలకు చేయాల్సినవి వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నదని ఆయన గుర్తు చేశారు

# మాజీ కౌన్సిలర్ కు ఎమ్మెల్యే పల్లా శుభాకాంక్షలు



మనప్రజాప్రతినిధి//చేర్యాల జనగామ: జనగామ నియోజకవర్గం.చేర్యాల మున్సిపల్ మాజీ కౌన్సిలర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి భార్య మంగోలు రమ్య బుధవారం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది.ఈ క్రమంలో విషయం తెలుసుకున్న స్థానిక జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి స్థానిక బిఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చంటి కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు.అలానే ఆడబిడ్డకు జన్మనిచ్చిన రమ్య చంటిలకు శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం రమ్య బిడ్డను కాసేపు గుండెలపై ఎత్తుకుని ఆడించారు.అనంతరం మాజీ కౌన్సిలర్ రాజకీయ నాయకుడు అయినప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చికిత్స చేయించుకోవడం చాలా సంతోషకరమన్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే తల్లి బిడ్డల ఆరోగ్య క్షేమం గురించి అడిగి తెలుసుకున్నారు.చేర్యాల ప్రభుత్వాసుపత్రిని మరింత అభివృద్ధి చేయడానికి తమవంతుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు.

# గోపాల్ నగర్ గ్రామంకు వచ్చిన నిధులు వివరాలు తెలియజేయండి




మనప్రజాప్రతినిధి// దినపత్రిక,బచ్చన్నపేట, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజక వర్గం. బచ్చన్నపేట మండలం, గోపాల్ నగర్ గ్రామంలో గత ఏడు సంవత్సరాలలో గ్రామానికి వచ్చిన నిధులు,వాటి ఖర్చులు,అభివృద్ధి పనులు,ఉపాధి హామీ పథకం,ఇండ్ల లబ్ధిదారులు, సమావేశాలు,భూమి అనుమతులు,మిగతా కార్యక్రమాల గురించి జరిగిన అభివృద్ధి గురించి ప్రభుత్వ నిధుల గురించి వివరాలు ఇవ్వాలని కార్యదర్శికి సమాచార హక్కు చట్టం ద్వారా పత్రం అందజేశారు.

## మద్యానికి బానిసై , జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట ఏప్రిల్ 15,:మాసాయిపేట గ్రామానికి చెందిన వల్లపు యాదగిరి (41)కూలి పని చేస్తూ జీవనం కొనసాగించేవాడు, గత కొద్ది రోజుల నుండి మద్యానికి బానిసై,జీవితంపై విరక్తి చెంది,తన అక్క ఇంట్లో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు, మృతునికి ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నట్టు గ్రామస్తులు తెలిపారు,. ఇట్టి విషయములో మృతుని భార్య వల్లపు అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్టు చేగుంట ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపారు.

## మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు 50% సబ్ కోటా కేటాయించాలి



మనప్రజాప్రతినిధి//హుజూర్ నగర్:మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు జనాభా ప్రాతిపదికగా 50 శాతం సబ్ కోటా కేటాయించాలని బీసీ మహిళా నాయకురాలు చీకూరి లీలావతి డిమాండ్ చేశారు. ఈ మేరకు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీ మహిళలకు మద్దతుగా నిలవాలని కోరారు. అప్పుడే బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. బీసీ మహిళలు నారిశక్తిగా గళం విప్పి తమ హక్కుల కోసం పోరాడాల్సిన సమయం వచ్చిందని పిలుపునిచ్చారు. ఇప్పుడే స్పందించకపోతే మహిళా రిజర్వేషన్లలో అగ్రవర్ణాల మహిళలకే అధిక ప్రాధాన్యం దక్కే ప్రమాదం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి బీసీ గళం పార్లమెంట్‌కు చేరాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఒకపోరాటం" స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలిగా తాను బీసీ మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తానని చీకూరి లీలావతి స్పష్టం చేశారు.

## ఆవిరి ఇంజన్ల నుంచి వందే భారత్ వరకు

**-భారతీయ రైల్వేల అద్భుత ప్రస్థానం**
**-1853లో మొట్టమొదటి రైలు ప్రయాణం చారిత్రక మైలురాళ్లు**
**-ఆధునిక సాంకేతికతతో మారుతున్న రైల్వే ముఖచిత్రం**
**-100 శాతం విద్యుదీకరణ బుల్లెట్ రైలు దిశగా అడుగులు**



ఏప్రిల్ 15 (మనప్రజాప్రతినిధి): భారతీయ రైల్వే చరిత్ర 1853 ఏప్రిల్ 16న ముంబై నుండి థానే వరకు నడిచిన మొట్టమొదటి రైలుతో ప్రారంభమైంది. అప్పట్లో సాహిబ్, సింధ్, సుల్తాన్ అనే మూడు ఆవిరి ఇంజన్లతో కేవలం 34 కిలోమీటర్ల మేర సాగిన ఈ ప్రయాణం నేడు 70,000 కిలోమీటర్లకు పైగా విస్తరించిన ప్రపంచంలోనే అతిపెద్ద నెట్‌వర్క్‌లలో ఒకటిగా నిలిచింది. 1925లో దేశంలో తొలిసారిగా విద్యుత్ రైలు ప్రవేశపెట్టడం, 1951లో రైల్వేల జాతీయాకరణ వంటివి కీలక మలుపులు. శతాబ్ద కాలం పాటు దేశవాళీ రవాణాకు వెన్నెముకగా నిలిచిన ఆవిరి ఇంజన్ల స్థానంలో 1960ల నుండి డీజిల్ విద్యుత్ ఇంజన్లు ప్రాచుర్యంలోకి వచ్చాయి, తద్వారా ప్రయాణ వేగం సామర్థ్యం గణనీయంగా పెరిగాయి. గడిచిన పది సంవత్సరాల్లో భారతీయ రైల్వే సాంకేతిక పరంగా సరికొత్త పుంతలు తొక్కింది. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా తయారైన 'వందే భారత్' ఎక్స్‌ప్రెస్ రైళు దేశీయ రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాయి. గంటకు 160 నుండి 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు ప్రయాణికులకు విమాన తరహా అనుభూతిని అందిస్తున్నాయి. తాజాగా 2026 ప్రారంభంలో వందే భారత్ స్లీపర్ కోచ్‌లు కూడా పట్టాలెక్కడం విశేషం. దీనితో పాటు అమృత్ భారత్ రైళ్ల ద్వారా సామాన్య ప్రయాణికులకు కూడా ఆధునిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. ఈ పరిణామాలు భారతీయ రైల్వేను అంతర్జాతీయ ప్రమాణాలకు చేరువ చేశాయి.పర్యావరణ హితమైన రవాణా దిశగా భారత ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ 100% విద్యుదీకరణ' ప్రాజెక్టు 2026 నాటికి తన లక్ష్యాన్ని దాదాపు చేరుకుంది. ప్రస్తుత నివేదికల ప్రకారం, దేశంలోని ప్రధాన బ్రాడ్ గేజ్ మార్గాల్లో సుమారు 99.4 శాతం విద్యుదీకరణ పూర్తయింది. ఇది డీజిల్ వినియోగాన్ని తగ్గించడమే కాకుండా, రైల్వే నిర్వహణ ఖర్చులను భారీగా ఆదా చేస్తోంది.



2030 నాటికి 'నెట్ జీరో కార్బన్ ఎమిటర్'గా ఎదగాలన్న లక్ష్యంతో సౌర పవన విద్యుత్ వినియోగాన్ని కూడా రైల్వే శాఖ పెంచింది. ఈ గ్రీన్ రైల్వే చొరవ వల్ల దేశ ఇంధన భద్రత మరింత బలపడనుంది.భారతీయ రైల్వేలో మరో భారీ మార్పు ఏమిటంటే 'కవచ్' అనే స్వదేశీ ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ. రైళ్ల మధ్య ఢీకొనే ప్రమాదాలను నివారించడానికి అభివృద్ధి చేసిన ఈ సాంకేతికతను దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్నారు. దీనితో పాటు కృత్రిమ మేధస్సు సహాయంతో రైల్వే నిర్వహణ, ట్రాక్‌ల పరీక్ష మరియు ప్రయాణికుల సేవలలో పారదర్శకతను పెంచుతున్నారు. 2026లో రైల్వే శాఖ 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' పేరుతో 52 వారాల్లో 52 సంస్కరణలను అమలు చేస్తోంది. దీని ద్వారా డిజిటల్ రిజర్వేషన్లు, టికెట్ బుకింగ్‌లో మార్పులు స్టేషన్ల ఆధునీకరణ వంటి అంశాల్లో సామాన్యులకు మరిన్ని వెసులుబాట్లు లభిస్తున్నాయి. 173 ఏళ్ల క్రితం ఆవిరి ఇంజన్ల 'ఛుక్ ఛుక్' శబ్దంతో మొదలైన ప్రస్థానం ఇప్పుడు ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్టు వరకు చేరుకుంది. అత్యాధునిక సాంకేతికత, వంద శాతం విద్యుదీకరణ, ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా భారతీయ రైల్వే గమనం సాగుతోంది. ఒకప్పుడు కేవలం రవాణా సాధనంగా ఉన్న రైలు, నేడు దేశ ప్రగతికి ప్రతిరూపంగా మారింది. డిజిటల్ ఇండియా లక్ష్యాలకు అనుగుణంగా రైల్వే సేవలు సామాన్యుడికి మరింత చేరువవుతున్నాయి. భవిష్యత్తులో మరిన్ని హైస్పీడ్ కారిడార్లు మరియు అత్యాధునిక రైళ్లతో భారతీయ రైల్వే ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవబోతోంది. ఈ చారిత్రక ప్రస్థానం ప్రతి భారతీయుడికి గర్వకారణం.

## 108 సేవలపై జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ ఆకస్మిక తనిఖీ



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల ఏప్రిల్ 15:రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట మండల కేంద్రంలో 108 అంబులెన్స్ పనితీరును మరియు అందులోని వైద్య పరికరాలను జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ భూమ నాగేందర్ బుధవారం క్షుణ్ణంగా పరిశీలించారు. అత్యవసర సమయాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఆయన సిబ్బందికి స్పష్టం చేశారు. పరికరాల పనితీరుపై ఆరాతనిఖీలో భాగంగా అంబులెన్స్‌లో ఉండే కీలకమైన వైద్య పరికరాలను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. ప్రధానంగామల్టీ ఛానల్ మానిటర్, ఏఈడిసెక్షన్ ఆపరేటర్, లారింగోస్కోప్‌సర్జికల్ స్కాలర్, గ్లూకోమీటర్‌పోర్టబుల్ ఆక్సిజన్ సిలిండర్లు వీటితో పాటు అత్యవసర మందుల నిల్వలను, వాటి ఎక్స్పైరీ తేదీలను నిశితంగా పరిశీలించారు. పరికరాలన్నీ ఎప్పటికప్పుడు పని చేసే స్థితిలో ఉండేలా చూసుకోవాలని సూచించారు.వాహనం కండిషన్ గురించి పైలట్‌ను అడిగి తెలుసుకున్న నాగేందర్, వాహనానికి సంబంధించి ఎలాంటి సాంకేతిక సమస్యలు ఉన్నా వెంటనే ఈఎంఈ ,అరుణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు."అత్యవసర చికిత్స కోసం 108 వాహనం 24 గంటల పాటు సిద్ధంగా ఉండాలి. ముఖ్యంగా మారుమూల గ్రామాల ప్రజలకు సేవలు అందేలా చూడాలన్నారు ప్రజలకు 108 సేవలపై మరింత అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లు నిర్వహించాలని ఆయన సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో అంబులెన్స్ పైలట్ నాలికే నవీన్, ఈఎంటి, పంతం సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చౌకధరల దుకాణం ప్రారంభించిన మండల తహసిల్దార్ బైరెడ్డి రాజేష్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ జవహర్ నగర్ జి.హెచ్. యంసి పరిధి లో ని డబల్ బెడ్ రూమ్ యందు గౌరవ మండల తహశీల్దార్ బైరెడ్డి రాజేష్ గారి ఆధ్వర్యం లో నూతన చౌకధరల దుకాణం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఆరై. సత్యనారాయణ , కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మల్లేపూల శ్రీకాంత్, జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస గుప్త, జిల్లా చౌకధరల దుకాణం అధ్యక్షులు బల్లి.శ్రీనివాస గుప్త, జవహర్ నగర్ చౌకధరల దుకాణం అధ్యక్షులు నంగునూరి పద్మావతి అశోక్ గుప్త, జవహర్ నగర్ కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కన్నమైన రాజు యాదవ్. జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు మాట్ల వినయ్, వాడు అధ్యక్షులు బూడిద వెంకటేష్, భాస్కర్, అజయ్, సాయి కృష్ణ, చౌక ధరల దుకాణం డీలర్లు ఎండి సూరజ్ భాష, రజిత గోపాల్, నర్సింగరావు, షర్మిల కాలేష, జాషువా, మంజుల సాయి, బస్తీ వాసులు సలీం, మొయినుద్దీన్, ముబాషీర్, సయ్యద్, మధు, మనీష్, ఓం ప్రకాష్, బన్నీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రిపోర్టర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా ? సమస్యలను ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా ? మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాము.


ఎలక్ట్రానిక్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో దూసుకువస్తున్న ప్రజాప్రతినిధి టి.వి. న్యూస్ ఛానల్‌లో పనిచేయుటకు అనుభవం ఉన్నవారు తెలంగాణ, ఆంధ్రా అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్స్, కాన్ట్యూటెన్సీ రిపోర్టర్స్ కావలెను.
Contact :
7382966665,7382566600
PRAJA MEDIA BROADCASTING PVT.LTD
U64203TG2021PTC155457